క్లుప్తంగా

నేడు వేపగుంట ముత్యమాంబ పండగ


ముత్యమాంబ అమ్మవారు

పెందుర్తి: వేపగుంటలో కొలువుదీరిన 15 గ్రామాల ఆరాధ్య దేవత ముత్యమాంబ పంగడను గురువారం ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది. బుధవారం రాత్రి తొలేళ్ల సంబరం అట్టహాసంగా నిర్వహించారు. గురువారం వేకువజాము నుంచి భక్తులకు అమ్మవారిని దర్శించుకోనున్నారు. ఈ సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. విద్యుత్ దీపాలతో అలంకరించారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. బాణ సంచా కాల్పుల నడుమ రాత్రికి అనుపోత్సవం నిర్వహిస్తామన్నారు. పండగకు వేలాదిమంది భక్తులు తరలిరానున్న నేపథ్యంలో పోలీసులు ప్రత్యేకంగా బందోబస్తు ఏర్పాటు చేశారు.

బైక్ అదుపు తప్పి యువకుడికి గాయాలు


క్షతగాత్రుడికి వైద్య సేవలు అందిస్తున్న సిబ్బంది

సబ్బవరం: మండలంలోని సబ్బవరం–చోడవరం రోడ్డులోని బంగారమ్మపాలెం వద్ద బుధవారం ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో ఓ యువకుడికి గాయాలయ్యాయి. దీంతో కుటుంబ సభ్యులు,స్థానికులు సబ్బవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించడంతో వైద్య సిబ్బంది వైద్య సేవలు అందించారు. వివరాలు.. మండలంలోని బంగారమ్మపాలేనికి చెందిన సాలాపు శ్రీను విజయనగరం కొత్తవలస మండలం మంగళపాలెంలో తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నారు.బంగారమ్మపాలెంలో ముత్యాలమ్మ పండగ ఉండడంతో ఇటీవల స్వగ్రామానికి వచ్చారు.శ్రీను ద్విచక్రవాహనంపై వెళ్తుండగా అదుపు తప్పడంతో గాయాలయ్యాయి. ప్రధాన వైద్యాధికారి డాక్టర్ చక్రవర్తి సిబ్బందితో కలిసి సకాలంలో వైద్య సేవలు అందించారు.

చెట్టు మీద నుంచి పడి వ్యక్తి మృతి

పెందుర్తి: మేకలకు గ్రాసం కోసం చెట్టు ఎక్కిన వ్యక్తి ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందిన ఘటన కృష్ణరాయపురం సమీపంలోని సేనాతివానిపాలెంలో బుధవారం చోటు చేసుకుంది. వివరాలివి..సేనాతివానిపాలెనికి చెందిన యడ్ల గంగులు(52) మేకలకు మేత కోసం సమీపంలోని చెట్టు ఎక్కి కొమ్మలు కోసే సమయంలో ప్రమాదవశాత్తు కింద పడిపోయాడు. దీంతో గంగులుకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పెందుర్తి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

స్టూల్ మీద నుంచి పడి...

పెందుర్తి: ఇంట్లో స్టూల్ ఎక్కి పనిచేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందిన ఘటన పులగాలిపాలెంల సమీపంలోని దుర్గానగర్‌లో చోటు చేసుకుంది. ఆలస్యంగా వెలుగుజూసిన ఈ ఘటనపై మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. శ్రీకాకుళం జిల్లా జగన్నాథపురానికి చెందిన నెయ్యల రామకృష్ణ(45) భార్య దేవితో కలిసి దుర్గానగర్ వలస వచ్చాడు. అయితే భార్యా భర్తల మధ్య విభేదాల కారణంగా దేవి శ్రీకాకుళంలో ఉంటుంది. దుర్గానగర్‌లో ఉన్న రామకృష్ణ ఇంట్లో పని చేసేందుకు స్టూల్ ఎక్కాడు. ప్రమాదవశాత్తు జారిపడి తలకు గాయంతో మృతి చెందాడు. రామకృష్ణ ఎంతకీ ఇంటి నుంచి బయటకు రాకపోవడంతో పొరుగున నివాసం ఉంటున్న మేడిశెట్టి అర్జున్ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు రామకృష్ణ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. భార్య దేవి ఫిర్యాదు మేరకు సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అలరించిన కథా కచేరీ

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో నిర్వహించిన కథా కచేరీ కార్యక్రమం అలరించింది. పలువురు సాహితీ వేత్తలు తమ కథలను సభకు పరిచయం చేశారు. సభాధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ కథల్లో జీవితం, వ్యక్తుల స్వభావం, ప్రాపంచిక సత్యాలు కనిపించాలన్నారు. కథ చదివిన పాఠకులకు తెలియని అనుభూతి కలగాలన్నారు. డాక్టర్ ఎస్.విజయ్‌కుమార్ మాట్లాడుతూ సామాజిక స్పృహ ఉన్న రచనలు చేయాలని సూచించారు.

కూటమిలో సెగలు

పెందుర్తి కూటమిలో రాజుకున్న సెగలు చల్లారడం లేదు. జనసేన అభ్యర్థి పంచకర్లకు సీటు కేటాయించడాన్ని బండారుతో పాటు అతడి అనుచరులు జీర్ణించుకోలేక పోతున్నారు. 40 ఏళ్ల టీడీపీ జెండా మోసిన తనకు అవమానం జరిగిందని రగలిపోతున్నారు. అధినేత తీరుపై అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. ఎక్కడి నుంచో వచ్చిన జనసేన అభ్యర్థికి సహకరించేది లేదని స్పష్టం చేస్తున్నారు.

సీన్ కట్ చేస్తే...

బండారు వర్గం చేస్తున్న హడావుడిని జనసేన నాయకులు లైట్ తీసుకుంటున్నారు. పొత్తు ధర్మం పాటించి సహకరిస్తే ఓకే.. లేకుంటే మా నెట్ వర్క్ మాకు ఉందంటూ స్పష్టం చేస్తున్నారు. దీంతో టీడీపీ శ్రేణులు మరింత రగిలి పోతున్నారు.

- బండారుకే టికెట్ కేటాయించాలని టీడీపీ శ్రేణుల ఆందోళన
- పంచకర్లకు సహకరించేది లేదని స్పష్టం
- లైట్ తీసుకుంటున్న పంచకర్ల వర్గం
- మరింత రగిలిపోతున్న టీడీపీ శ్రేణులు



పెందుర్తి: "40 ఏళ్లుగా టీడీపీని మోస్తున్న మా బండారు సత్యనారాయణమూర్తిని కాదని పార్టీలు మారుతూ వచ్చిన వ్యక్తికి పెందుర్తి టికెట్ ఇస్తారా.. నిన్న కాక మొన్న జనసేనకు వచ్చిన వలస పక్షికి మేం ఓట్లు వేయాలా.. ఎట్టిపరిస్థితిలోనూ జనసేనకు సహరించబోం'' పెందుర్తి గ్రామీణ ప్రాంతానికి చెందిన ఓ కరుడుగట్టిన టీడీపీ నేత ఆక్రోశం ఇది.

- "పొత్తు ధర్మం ప్రకారం జనసేనకు సహకరిస్తే మంచిది. కానీ 40 ఏళ్ల ఇండస్ట్రీ అంటూ బండారు వర్గీయులు మా మీద విర్రవీగుతున్నారు. మా అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు టీడీపీ నాయకుల ఓట్ల మీద ఆధారపడి ఏమీ పోటీ చేయడం లేదు. మా బలం మాకుంది. బండారు వర్గీయుల ఓట్లు అవసరం మాకు ఉండకపోవచ్చు'' ఇదీ సబ్బవరం ప్రాంతానికి చెందిన జనసైనికుడి విశ్వాసం.

టీడీపీ–జనసేన–బీజేపీ చేసుకున్న పొత్తు పెందుర్తిలో వికటించింది. టీడీపీ సీనియర్ నేత బండారు సత్యనారాయణమూర్తిని అవమానకరంగా పక్కన పెట్టి జనసేన నేత పంచకర్ల రమేష్‌బాబుకు సీటు కేటాయించడంతో బండారు వర్గీయులు అగ్గి మీద గుగ్గిలమవుతున్నారు. సీనియర్ నేత బండారును కాదని పంచకర్లకు పెందుర్తి కేటాయించడంతో తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. 'చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేష్ డౌన్‌డౌన్ అంటూ ఆగ్రహావేశాలు వెలిబుచ్చుతున్నారు. అయితే టీడీపీ శ్రేణుల ఆగ్రహాన్ని జనసేన కేడర్ చాలా తేలిగ్గా తీసుకుంటుంది. పొత్తు ధర్మాన్ని పాటించని మీ మద్దతు మాకు అక్కర్లేదు అన్నట్టు టీడీపీని ఉద్దేశించి జనసైనికులు సోషల్ మీడియా.. ఇతర వేదికల్లో వ్యాఖ్యలు చేయడంతో బండారు అనుచరులు మరింత రగిలిపోతున్నారు.

మొదటి నుంచీ వ్యతిరేకతే..


రాజకీయంగా ప్రత్యర్థులైన బండారు సత్యనారాయణమూర్తి, పంచకర్ల రమేష్‌బాబుకు తొలి నుంచీ పొసగడం లేదు. టీడీపీ–జనసేన పొత్తు ఖరారు చేసుకున్న తర్వాత నుంచి టీడీపీ నుంచి బండారుకే సీటు అని టీడీపీ శ్రేణులు, అటు జనసేన నుంచి పంచకర్లకు పెందుర్తి టికెట్ కేటాయిస్తారని ఎవరికివారు ప్రచారం చేసుకున్నారు. పలు సందర్భాల్లో ఒకవేళ జనసేనకే పెందుర్తి టికెట్ కేటాయించాల్సి వస్తే ఎట్టిపరిస్థితిలో పంచకర్లకు ఇవ్వొద్దని బండారు అధినేత చంద్రబాబును కోరారు. తనకు కాని పక్షంలో జనసేన నుంచి టి.శివశంకర్‌కు టికెట్ ఇవ్వాలని బండారు తేల్చిచెప్పారు.

బండారును పట్టించుకోని చంద్రబాబు

అయితే బండారు మాటను చంద్రబాబు చాలా తేలిగ్గా తీసుకుని..పెందుర్తి సీటు జనసేనకు కేటాయిస్తూ ఆ పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ ద్వారా పంచకర్ల రమేష్‌బాబు పేరును ఖరారు చేయించారు. దీంతో బండారు తీవ్ర అవమానభారంతో కుంగిపోయారు. తనకు టికెట్ ఇవ్వకపోగా.. తనకు నచ్చని వ్యక్తికి టికెట్ వచ్చేలా చంద్రబాబు వ్యవహరించారని మండిపడుతున్నారు. బండారుకు సీటు ఇవ్వకపోగా.. తమకు నచ్చని పంచకర్లకు టికెట్ రావడంతో టీడీపీలోని ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకులతో పాటు కార్యకర్తలు కూడా చంద్రబాబు, పవన్‌కల్యాణ్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నారు. తమ సత్తా ఏంటో ఎన్నికల్లో చూపెడతామని బండారు అనుచరులు స్పష్టం చేస్తున్నారు. ఈ రచ్చను గమనిస్తున్న రాజకీయ విశ్లేషకులు పెందుర్తిలో కూటమి బంధానికి బీటలు వారిందని చర్చించుకుంటున్నారు.

శేషతల్పంపై అప్పన్న


శేషతల్పంపై అప్పన్నకు తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న ఈవో తదితరులు


అప్పన్న ఉత్సవమూర్తులు

- పరవశించిన భక్తజనం
- వైభవంగా తిరువీధి
- జనసంద్రంగా మారిన సింహగిరి మాడ వీధులు

సింహాచలం: సింహగిరిపై నిర్వహించిన సుదర్శన నారసింహ మహా యజ్ఞంలో భాగంగా బుధవారం సాయంత్రం స్వామికి శేషతల్పంపై తిరువీధి నిర్వహించారు. స్వామివారి ఉత్సమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవిలను ముస్తాబు చేసి శేషతల్పంపై అధిష్టంపజేసి సాయంత్రం సింహగిరి మాడ వీధుల్లో తిరువీధిని ఘనంగా నిర్వహించారు. విశేషంగా హారతి అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాట ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధాన పురోహిత్‌డు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు, రుత్వికులు, పారాయణదారులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య


నాగేంద్ర(ఫైల్)

సింహాచలం: జీవీఎంసీ 93వ వార్డు పరిధి శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి వెనుక ఉన్న ఖాళీ స్థలంలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం వెలుగుచూసింది. పెందుర్తి పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. 93వవార్డు పరిధి పల్లి నారాయణపురానికి చెందిన కర్రి నాగేంద్ర(39) టైలరింగ్ చేస్తున్నాడు. భార్య రామలక్ష్మి, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. నాగేంద్రకు మతిస్థిమితం సరిగ్గా ఉండకపోవడంతో అప్పుడప్పుడు ఇంట్లో నుంచి బయటికి వెళ్లి రెండు మూడురోజుల తర్వాత తిరిగి వస్తుంటాడు. అలాగే రెండు రోజుల కిందట ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. కుటుంబసభ్యులు నాగేంద్ర కోసం ఎదురుచూస్తున్నారు. ఈ తరుణంలో బుధవారంఉదయం శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి వెనుక ఖాళీప్రదేశంలో చెట్టుకొమ్మకు ఉరిపోసుకుని నాగేంద్ర కనిపించాడు. అక్కడికి చేరుకున్న స్థానికులు మృతదేహం నాగేంద్రదిగా గుర్తుపట్టారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పెందుర్తి పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. రెండు రోజుల కిందటే నాగేంద్ర ఆత్మహత్యకు పాల్పడినట్టు ప్రాథమికంగా నిర్ధారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీఎం జగన్‌తోనే అన్ని వర్గాలకు భరోసా


పాత అడవివరంలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

సింహాచలం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే అన్ని వర్గాలకు భరోసా లభిస్తుందని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. జీవీఎంసీ 98వ వార్డు పరిధి పాత అడవివరంలో బుధవారం రాత్రి వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్సఝాన్సీని, భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావును అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించాలని కోరారు. మళ్లీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అయితేనే మరింత సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని తెలియజేశారు. ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా ఫ్యాన్ గుర్తు ఓటు వేయాలని కోరారు. 98వవార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, వార్డు ఇన్‌చార్జి ఎర్ర వరహానరసింహం, మాజీ అధ్యక్షుడు పీతల అప్పలరాజు, నాయకులు లంక సత్తిబాబు, మజ్జి ధర్మా, రెడ్డి, ఎన్. అప్పారావు, వర్మ, బోర లక్ష్మణరెడ్డి, పాత అడవివరం వైఎస్సార్‌సీపీ నాయకులు బొట్టా శ్రీను, లండ వెంకటరమణ, లండ విజయ్‌భాస్కర్, పాలూరి సూరిబాబు, నక్క శ్రీను, బంక నర్సునాయుడు, లండ రమేష్, మజ్జి అప్పలరమణ, మజ్జి ధర్మా పాల్గొన్నారు.

ఏయూను సందర్శించిన ఇన్ఫోసిస్ ప్రతినిధులు


ఇన్ఫోసిస్ ప్రతినిధి సురేష్‌ను సత్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని ఇన్ఫోసిస్ విశాఖ కేంద్రం ప్రతినిధులు సందర్శించారు. ఇన్ఫోసిస్ విశాఖపట్నం డెలివరీ సెంటర్ హెడ్ ఎన్.సురేష్ బుధవారం ఉదయం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డితో సమావేశమై, వివిధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా సురేష్‌ను వర్సిటీ తరపున సత్కరించి జ్ఞాపికను బహూకరించారు. కార్యక్రమంలో ఏయూ ఇంజినీరింగ్ కళాశాల ప్లేస్‌మెంట్ అధికారి మూర్తి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఏయూ ఇంక్యుబేషన్, స్టార్టప్ సెంటర్‌ను ప్రత్యక్షంగా పరిశీలించి, అక్కడ వివిధ సంస్థలు నిర్వహిస్తున్న విధానం, యువత పారిశ్రామిక వేత్తలుగా సంస్థలను ప్రారంభించి పనిచేస్తున్న విధానాన్ని పరిశీలించారు.

మానవతా దృక్పథం పెరగాలి


సదస్సు సంచికను అవిష్కరిస్తున్న ఆచార్య రజని తదితరులు

ఏయూక్యాంపస్: సమాజంలో మతవిశ్వాసాల కంటే మానవతా దృక్పథం నెలకొల్పడం ఎంతో అవసరమని శ్రీకాకుళం డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.ఆర్. రజని అన్నారు. ఏయూ తత్వశాస్త్ర విభాగంలో బుధవారం నిర్వహించిన ధార్మిక విజ్ఞాన పరిణామం–ప్రాచీన సంప్రదాయాలపై ఆధునిక దృక్పథాలు అనే అంశంపై నిర్వహించిన జాతీయ సదస్సులో ఆమె పాల్గొన్నారు. మనుషుల మధ్య మతం అడ్డుగోడగా మారకూడదన్నారు. మతాల సారాంశం తోటి వారిని ప్రేమించడమే అన్నారు. స్వార్థంతో మత ఘర్షణలకు పాల్పడుతూ మానవుడు సమాజంలో అశాంతికి కారణంగా మారుతున్నాడని ఈ విధానంలో మార్పు రావాలని ఆకాంక్షించారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ మాట్లాడుతూ సాంకేతిక ప్రగతి నేపథ్యంలో ప్రపంచం కుగ్రామంగా మారిందని, అదే సమయంలో మానవతా విలువలు లోపిస్తున్నాయన్నారు. ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు మాట్లాడుతూ ప్రాచీన ధార్మిక విషయాలలో ఉన్న జ్ఞానాన్ని నేటితరం యువత అందిపుచ్చుకోవాలని సూచించారు. బెంగళూరు యాక్ట్స్ అకాడమీకి చెందిన సంతోష్ జ్ఞానకన్, విభాగాధిపతి ఆచార్య వానపల్లి వెంకటరావు, అమెరికాలోని బ్రిగామ్ యంగ్ యూనివర్సిటీ ఆంత్రోపాలజీ ఆచార్యులు చార్లెస్ విలియం నికోలస్, డాక్టర్ బి.వెంకట స్వామి తదితరులు ప్రసంగించారు.

3 నుంచి మహిళలకు వేసవి శిక్షణ తరగతులు

మురళీనగర్: మహిళలు స్వయం ఉపాధితో ఆర్థిక పరిపుష్టి సాధించేందుకు మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 3 నుంచి ఉచిత వేసవి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు సత్తి లలితారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మురళీనగర్ పేస్ట్రీ షాపు సమీపంలోని భవనంలో కె.సుగుణ ఆధ్వర్యంలో మహిళలకు జ్యూట్ బ్యాగ్స్ స్టిచింగ్‌పై పది రోజుల పాటు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తి గల వారు 90320 94771 నంబర్‌కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

30 నుంచి అంతర్జాతీయ గణిత శాస్త్ర సదస్సు



పోస్టర్ విడుదల చేస్తున్న ఆచార్య అనురాధ కామేశ్వరి

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం గణిత శాస్త్ర విభాగంలో ఈనెల 30, 31 తేదీల్లో అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు సదస్సు సంచాలకులు, గణిత శాస్త్ర విభాగాధిపతి ఆచార్య పి.అనురాధ కామేశ్వరి తెలిపారు. సదస్సు పోస్టర్‌ను బుధవారం ఆచార్యులతో కలిసి ఆవిష్కరించారు. గణితం, అనువర్తిత గణితం, ఇంజినీరింగ్ గణితం అంశాలపై సదస్సు జరుగుతుందన్నారు. ఉత్తరాంధ్ర సొసైటీ ఫర్ మ్యాథమెటికల్ సైన్సెస్, ఆచార్య ఎస్.మీనాక్షి సుందరం మెమోరియల్ సొసైటీ, ఏయూ గణితశాస్త్ర విభాగం సంయుక్తంగా ఈ సదస్సును నిర్వహిస్తాయని తెలిపారు. కొరియా నుంచి ఆచార్య వై.జె. చో, ఆచార్య జి.వి.ఆర్. బాబు కీలకోపన్యాసాలు చేస్తారన్నారు. నేపాల్, ఆస్ట్రేలియా, భారత్‌కు చెందిన 12 మంది వక్తలతో పాటు 200 మంది వరకు ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ సి.హెచ్. శ్రీనివాసరావు, విభాగ ఆచార్యులు పి.డి.ఎన్. శ్రీనివాసు, ఆచార్య జి.నానాజీ రావు, ఎస్.రవికుమార్, ఆచార్య ఎస్.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి జనసేన కార్యకర్తలు


వైఎస్సార్‌సీపీలో చేరిన జనసేన కార్యకర్తలు, అభిమానులతో ఎమ్మెల్యే అదీప్‌రాజ్

ఆహ్వానించిన ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సబ్బవరం: మండలంలోని అంతకాపల్లి పంచాయతీ నుంచి జనసేన కార్యకర్తలు, పార్టీ అభిమానులు బుధవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. లాలం అచ్చెంనాయుడు, అలీ అధ్యక్షతన పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే అదీప్‌రాజ్ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో చిటికి రెడ్డి కిరణ్,వనం హేమంత్,గండి దినేష్,ప్రవీణ్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు,సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బయలపూడి భగవాన్ జయరాం,కార్పొరేటర్ ముమ్మన దేముడు,పెందుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ దేవిసాంబ,మాజీ సర్పంచ్ దేముడు బాబు,వైస్ సర్పంచ్ గొర్లి అప్పారావు,పార్టీ నాయకులు జగదీష్,కోటి బాబు,శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

తుదిదశకు ఐసోలేషన్ సెంటర్ నిర్మాణ పనులు


సబ్బవరం పీహెచ్‌సీ ప్రాంగణంలో శరవేగంగా సాగుతున్న ఐసోలేషన్ సెంటర్ పనులు

సబ్బవరం: సబ్బవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న ఐసోలేషన్ సెంటర్ పనులు తుదిదశకు చేరుకున్నాయి. దీంతో త్వరలో ప్రారంభించడానికి సిద్ధం చేస్తున్నారు. అలాగే గుల్లేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో కూడా రూ.10 లక్షలతో ఐసోలేషన్ సెంటర్ నిర్మించనున్నారు.కోవిడ్ వంటి పలు రకాల అంటు వ్యాధులు విజృంభించే సమయంలో ప్రత్యేకంగా రోగులకు వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో ఈ సెంటర్ నిర్మాణం చేపట్టారు. ఆర్నెల్ల కింద ఈ పనులకు ఎంపీపీ సూర్యకుమారితో కలిసి ఎమ్మెల్యే అదీప్‌రాజ్ భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. త్వరలో సేవలందించేందుకు ఐసోలేషన్ సెంటర్ అందుబాటులోకి రానుంది.

ప్రశాంతంగా పదోతరగతి పరీక్షలు


సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రం నుంచి బయటకు వస్తున్న పదోతరగతి విద్యార్థులు


పరీక్ష రాసిన ఆనందంలో విద్యార్థులు

సబ్బవరం: పదోతరగతి పరీక్షలు బుధవారంతో ప్రశాంతంగా ముగిశాయి.మండలంలోని 5 పరీక్షాల కేంద్రాల్లో నిర్వహించిన ఈ పరీక్షలు సోషల్ స్టడీస్ సబ్జెక్టుతో పూర్తయ్యాయి.ఈ పరీక్షకు 934 విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 10 మంది గైర్హాజరయ్యారని మండల విద్యాశాఖాధికారి లక్ష్మణరావు తెలిపారు. సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పరీక్షకు 220 మందికి గానూ 211 మంది విద్యార్థులు హాజరు కాగా 9 మంది గైర్హాజరయ్యారు. రావలమ్మపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పరీక్షకు 138 మంది విద్యార్థులకు గాను ఒకరు హాజరు కాలేదని ఎంఈవో తెలిపారు. ఇక సన్‌రిడ్జ్ ఇంగ్లిష్ మీడియం స్కూల్, మదర్ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన పరీక్షలకు శత శాతం విద్యార్థులు హాజరయ్యారు.

మట్టి దందా

పెదముషిడివాడ ఎర్ర చెరువులో అక్రమంగా తవ్వకాలు


మట్టి తవ్వకాలతో గుల్ల అయిన పెదముషిడివాడ ఎర్ర చెరువు

పరవాడ: పెదముషిడివాడ గ్రామంలో మట్టి దొంగలు రోజు రోజుకూ రెచ్చిపోతున్నారు. గ్రామంలో కొండలు, గెడ్డలు, చెరువులు ఎక్కడపడితే అక్కడ మట్టి, గ్రావెల్ దర్జాగా తవ్వి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అనుమతులు లేకుండా దర్జాగా మట్టి తవ్వి తరలించి లంకెలపాలెంలో అన్‌లోడ్ చేస్తుండగా మైనింగ్ అధికారులు దాడి చేసి మూడు లారీలు అదుపులోకి తీసుకొని పరవాడ పోలీసులకు అప్పగించిన విషయం తెలిసిందే. మైనింగ్ అధికారులు పట్టుబడ్డ లారీలను పోలీసులకు అప్పగించి వెళ్లారో లేదో వెను వెంటనే మంగళవారం రాత్రి గ్రామానికి చెందిన పలువురు లారీ యజమానులు స్థానిక ఎర్ర చెరువులో మట్టి తవ్వకాలు చేశారు. ఈ. మర్రిపాలెం, లంకెలపాలెం ప్రాంతాల్లోని జరుగుతున్న ఇళ్ల పునాదుల ఫిల్లింగ్‌లకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. మూడు యూనిట్లు లారీ మట్టిని రూ.4 వేలు, ట్రాక్టరు మట్టి రూ.3 వేలకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. ఎర్ర చెరువులో రెండు మీటర్ల లోతులో పొక్లెయిన్‌తో మట్టి తవ్వకాలు చేసి వేలాది టన్నుల మట్టిని తరలించుకుపోయారు. మట్టి తవ్వకాలకు అడ్డు తగిలిన చెట్లను కూడా నరికి వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తున్నారు. గ్రామంలో చెరువులు, కొండబంజర్లను కొల్లగొడుతున్న మట్టి దొంగలపై గనులు, భూగర్భశాఖ, రెవెన్యూ శాఖ అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన


నృత్యప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

సింహాచలం: సింహగిరిపై బుధవారం జరిగిన నృత్యప్రదర్శన భక్తులను విశేషంగా అలరించింది. విశాఖకు చెందిన నృత్యభారతి అకాడమీ విద్యార్థులు ఆలయ రాజగోపురం వద్ద ఉన్న కళావేదికపై పలు భక్తిగీతాలకు నృత్య ప్రదర్శన చేశారు. దాదాపు గంటపాటు కొనసాగిన ఈ కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది.